1
నవతెలంగాణ
ఆదిలాబాద్
మంగళవారం | సెప్టెంబర్ 26, 2023 | www.navatelangana.com

డీజే సౌండ్స్‌కు అనుమతి లేదు : సీఐ బుద్దె స్వామి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

గణేష్ నిమజ్జనంలో డీజే సౌండ్స్‌కు అనుమతి లేదని టౌన్ సీఐ బుద్దె స్వామి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో డీజే సౌండ్ సిస్టం యాజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ ప్రతి గణేష్ మండపానికి రెండు సాధారణ సౌండ్ బాక్సులు మాత్రమే పెట్టాలని, అంతకన్నా ఎక్కువ బాక్సులు పెడితే సదరు డీజే యాజమానిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చట్టప్రకారం కేసులు నమోదు చేసి డీజేలను జప్తు చేసి కోర్టులో ప్రవేశపెడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ శ్రీకాంత్, డీజే యాజమానులు పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ ఏడీకి వినతిపత్రం

కౌటాల : విద్యుత్ శాఖ ఏడీ రాజేశ్వర్‌కు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్ ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న దళిత లబ్ధిదారులకు వంద యూనిట్ల ఉచిత కరెంటును అందజేయాలని కోరారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం వంద యూనిట్ల ఉచిత కరెంటు ఎక్కడా అమలు కావడం లేదని తెలిపారు. ప్రతి దళిత అర్హత గల కుటుంబం కుల సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, విద్యుత్ కనెక్షన్ పత్రాలతో కూడిన దరఖాస్తులను ఏడీకి అందజేశారు. దీనిపై ప్రభుత్వం స్పందించకుంటే పోరాటానికి సిద్ధమన్నారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం రాజ్‌కుమార్, కేవీపీఎస్ నాయకులు గోమాస శ్రావణ్, ముంజంకార్ శంకర్, డోంగ్రి ఆనంద్, తనూజీ, దల్జిత్, సోమయ్య ఉన్నారు.



బీఆర్ఎస్‌కు రాథోడ్ బాపురావు గుడ్‌బై..!

- టికెట్ నిరాకరించడంతో కొన్ని రోజులుగా మనస్థాపం
- కేటీఆర్ అపాయింట్‌మెంట్ లభించకపోవడమూ కారణమే
- ఏ పార్టీలో చేరేది ఒకట్రెండు రోజుల్లో నిర్ణయం వెల్లడించే అవకాశం
- ఎన్నికల ముంగిట గులాబీ పార్టీకి కష్టకాలం

బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు బీఆర్ఎస్ పార్టీని వీడనున్నారు. బీఆర్ఎస్ తరపున దశాబ్దకాలం పాటు శాసనసభ్యుడిగా కొనసాగుతున్న ఆయన గులాబీ గూటి నుంచి బయటకు రానున్నారు. పార్టీకి రాజీనామా చేసే విషయమై ఒకట్రెండు రోజుల్లో వెల్లడించే అవకాశం ఉందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ టికెట్ నిరాకరించడంతో మనస్థాపం చెందిన ఆయన కొన్ని రోజుల పాటు స్తబ్ధుగా ఉన్నారు. టికెట్ రాకపోయినా పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ వచ్చిన ఆయన హఠాత్తుగా గులాబీ పార్టీని వీడాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ అపాయింట్‌మెంట్ కోసం మూడు రోజుల నుంచి ఎదురుచూసినప్పటికీ మంత్రి అవకాశం ఇవ్వకపోవడంతో మనస్థాపం చెందినట్లు తెలుస్తోంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టికెట్ నిరాకరించడంతో పాటు మంత్రి కేటీఆర్ సైతం పట్టించుకోకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. మరోపక్క ఏ పార్టీలో చేరాలనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల ముగింట బీఆర్ఎస్ పార్టీకి కష్టకాలం ఎదురువుతోంది. ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు ఉండగా ఇందులో ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు పార్టీ టికెట్లు కేటాయించింది. మిగితా ముగ్గురు ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మాత్రం టికెట్ నిరాకరించింది. ఈ మూడు స్థానాల్లో బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో ఇద్దరు కొత్త వారికి అనిల్‌జాదవ్, జాన్సన్‌నాయక్‌లకు టికెట్లు కేటాయించగా..ఆసిఫాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే కోవ లక్ష్మీకి టికెట్ కేటాయించింది. దీంతో టికెట్ దక్కలేదనే కారణంగా ఖానాపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్ ఇప్పటికే పార్టీ అధిష్టానంపై తిరుగుబాటు బావుట ఎగురవేసింది. ప్రస్తుతం బీఆర్ఎస్‌లోనే ఉన్నా.. త్వరలోనే కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతోందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఈమె భర్త శ్యాంనాయక్ హస్తం పార్టీలో చేరి ఆసిఫాబాద్ టికెట్ ఆశిస్తున్నారు. త్వరలో ఆమె కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఆసిఫాబాద్ నుంచి టికెట్ దక్కని మరో సిట్టింగ్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు పార్టీ అధిష్టానం ఎంపీ టికెట్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఆయన ప్రస్తుతానికి సైలెంట్‌గా ఉన్నారనే చర్చ జరుగుతోంది. మరోపక్క దశాబ్దకాలం పాటు బీఆర్ఎస్ తరపున బోథ్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న రాథోడ్ బాపురావుకు పార్టీ రానున్న ఎన్నికల్లో టికెట్ నిరాకరించింది. బోథ్ నుంచి ఈ సారి నేరడిగొండ జడ్పీటీసీ సభ్యుడు, గతంలో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన అనిల్‌జాదవ్‌కు పార్టీ టికెట్ కేటాయించింది. దీంతో మనస్థాపం చెందిన రాథోడ్ బాపురావు కొన్ని రోజుల పాటు సైలెంట్ ఉన్నారు. పార్టీ అధిష్టానం ఆయనను పిలిపించి మాట్లాడటంతోనే పార్టీపై ఎలాంటి తిరుగుబాటు చేయలేదని తెలిసింది. మరోపక్క టికెట్ రాకపోయినా నిన్న, మొన్నటి వరకు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ వచ్చారు. పార్టీ మారే ఆలోచన లేదని చెబుతూ వచ్చారు. తాజాగా పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు సన్నిహితుల ద్వారా తెలుస్తోంది.

లభించని కేటీఆర్ అపాయింట్‌మెంట్ ..?

పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ అపాయింట్‌మెంట్ లభించకపోవడంతోనే రాథోడ్ బాపురావు పార్టీని వీడాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గత మూడు రోజులుగా హైదరాబాదులో ఆయనను కలిసేందుకు ప్రయత్నించినా..మంత్రి అవకాశం కల్పించలేదని తెలిసింది. సిట్టింగ్ ఎమ్మెల్యే అయి ఉండి పార్టీ టికెట్ నిరాకరించడం.. తాజాగా మంత్రి కలిసేందుకు కూడా అవకాశం ఇవ్వకపోవడంతో మనస్థాపం చెందిన ఆయన పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గులాబీ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతారని ముమ్మర ప్రచారం జరుగుతున్నా.. ఆయన సన్నిహితులు మాత్రం ఏ పార్టీలో చేరుతారని ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెబుతున్నారు. ఒకటి, రెండు రోజుల్లో మీడియా సమావేశం నిర్వహించి పార్టీకి రాజీనామా విషయంతో పాటు ఏ పార్టీలో చేరనున్నారో తెలియజేస్తారని తెలిసింది. తాజాగా బోథ్ ఎమ్మెల్యే పార్టీకి రాజీనామా చేయనుండటం.. ఇప్పటికే ఖానాపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే పార్టీ అధిష్టానంపై తిరుబాటు చేయడం వంటి పరిణామాలు ఎన్నికల ముంగిట గులాబీ పార్టీకి ఇబ్బందికరంగా మారుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గ్రూప్-1 పరీక్ష రద్దుకు కేసీఆర్ పాలనే కారణం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రూప్-1 పరీక్ష రెండోసారి రద్దు కావడానికి ముమ్మాటికీ కేసీఆర్ నిరంకుశ కుటుంబ పాలననే కారణమని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్ ఆరోపించారు. టీఎస్‌పీఎస్‌సీని ప్రక్షాళన చేసి గ్రూప్-1 పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 5000 పోస్టుల డీఎస్సీ నోటిఫికేషన్ రద్దుచేసి 13000 పోస్టులతో కొత్త డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్ నెలలో నిర్వహించే గ్రూప్-2తో పాటు ఇతర పరీక్షలు కొత్త కమిషన్ హయాంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి రమేష్, మహేందర్, మెస్రం జంగుబాబు పాల్గొన్నారు.

గోదావరిలో మృతదేహం లభ్యం

నవతెలంగాణ-బాసర

గోదావరిలో సోమవారం మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై గణేష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బోకర్ పట్టణానికి చెందిన బురేవార్ తిరుపతి(49) సంవత్సర కాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. వ్యాధి నాలుగో స్టేజీలో ఉండడంతో జీవితంపై విరక్తి చెంది గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరు మట్కా నిందితుల అరెస్ట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని సాత్నాల బస్టాండ్ ఏరియాలో సోమవారం సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ సాయినాథ్ బృందం ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి సయ్యద్ అక్తర్ అలీ, ఠాకూర్ రాజేందర్‌సింగ్‌ను పట్టుకున్నారు. వీరి వద్ద రూ.5430 నగదు, మట్కా చిట్టీలు, రెండు మొబైల్ ఫోన్లు ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో అప్పగించినట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

నవతెలంగాణ - కౌటాల

విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుండి మంజూరైన రూ.10లక్షల చెక్కును ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెజ్జూర్ మండలం నాగుల్వాయి గ్రామానికి చెందిన మొర్లె బాపురావు గతేడాది ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో మరణించాడు. బాధిత కుటుంబానికి విద్యుత్ శాఖ నుండి పరిహారం మంజూరైంది. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మన్నెవార్ల కమ్యూనిటీ హాళ్లకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేత



నవతెలంగాణ - కౌటాల

మన్నెవార్ కొలావార్ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధుల ప్రొసీడింగ్ పత్రాలను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సోమవారం మండల కేంద్రంలోని తన నివాసంలో అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని సిర్పూర్, బెజ్జూర్, చింతలమానేపల్లి మండలాల్లో ఒక్కో భవన నిర్మాణానికి రూ.15 లక్షల చొప్పున ప్రొసీడింగ్ పత్రాలను ఆదివాసీ కొలావార్ సంఘం నాయకులకు అందజేశామని తెలిపారు. కమ్యూనిటీహాల్ భవన నిర్మాణం నాణ్యతలోపం లేకుండా నిర్మించుకోవాలన్నారు.

రేపటి చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామపంచాయతీ కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 27న నిర్వహించ తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరిక శ్రీకాంత్ కోరారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జులై 6 నుంచి ఆగస్టు 8 వరకు 34 రోజుల చేసిన నిరవధిక సమ్మెకు స్పందించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆగస్టు 8న జేఏసీని చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. 15 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మంత్రి ఇచ్చిన హామీ మేరకు సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశామని, ఇప్పటికీ 45 రోజులు గడిచినా రాష్ట్ర ప్రభుత్వం హామీ నెరవేర్చకపోవడంతో కార్మికుల్లో అసంతృప్తితో ఉన్నారని అన్నారు. రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు 27న బుధవారం చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుండి కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. విలేకరుల సమావేశంలో గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా నాయకులు రాజు, తోట సమ్మయ్య పాల్గొన్నారు.

వినాయక మండపాలను పరిశీలించిన సీఐ

కౌటాల : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం సీఐ సాదిక్‌పాషా వినాయక మండపాలను పరిశీలించారు. మండపాల కమిటీలకు నిమజ్జనోత్సవంలో అత్యుత్సాహం ప్రదర్శించి ప్రాణాలమీదికి తెచ్చుకోవద్దని, వినాయక మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకొని ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేసుకోవాలని సూచించారు.

ఆరు గ్యారంటీలతో భరోసా

- పట్టణంలో కార్డుల పంపిణీ ప్రారంభం



గ్యారంటీ కార్డులతో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అర్హులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలతో భరోసా ఇస్తున్నామని డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. సోమవారం పట్టణంలోని అబ్దుల్లా చౌక్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో తుక్కు గూడ భారీ బహిరంగ సభలో ప్రవేశపెట్టిన అభయహస్తం ఆరు కాంగ్రెస్ గ్యారంటీ కార్డులను పంచే కార్యక్రమాన్ని ఇంటి ఇంటికి తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రతి ఒక్కరూ ఆదరించి ఓటు వేసి గెలిపిస్తే తప్పకుండా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి క్యాబినెట్ సమావేశంలో ఆమోదించి 100 రోజుల్లో గ్యారంటీలను అమలు చేసి తీరుతామని తెలిపారు. కాంగ్రెస్ కర్ణాటక రాష్ట్రంలో ఇదే తరహాలో ఆరు గ్యారెంటీ కార్డులను ప్రవేశపెట్టి అధికారంలో వచ్చిన వెంటనే మొదటి క్యాబినెట్ సమావేశంలోనే ఆమోదించి దిగ్విజయంగా అమలు చేసి చూపించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా వచ్చే సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అభయ హస్తం పేరిట రూపొందించిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేసి తీరుతుందని స్పష్టం చేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం తప్పకుండా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలను మొదటి క్యాబినెట్ సమావేశంలోనే ఆమోదించి పేద ప్రజలకు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గుడిపల్లి నగేష్, జిల్లా కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి సంతోష్, జిల్లా ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ సెడ్మకి ఆనందరావు, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కాంబ్లే శివాజీ, పట్టణ మైనార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు రసూల్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు వసీంఖాన్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అర్బత్ ఖాన్, ఎస్సీ సెల్ అసెంబ్లీ అధ్యక్షుడు చందాల రాహుల్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు షేక్ నాహిద్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల సమ్మె

- వేతనం రూ.18వేలు నిర్ణయించాలి : సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమేష్



కలెక్టరేట్ ఎదుట సమ్మెలో ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్స్ సోమవారం కలెక్టరేట్ ఎదుట సమ్మె ప్రారంభించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18వేలు నిర్ణయించి పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారానికి గతంలో 106 రోజుల సమ్మె చేశారని గుర్తు చేశారు. అయినా రాష్ట్ర ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదన్నారు. ఆశా వర్కర్లు ఎన్నో సంవత్సరాల నుండి పని చేస్తున్నారన్నారు. వీరంతా మహిళలు బడుగు బలహీన వర్గాలకు చెందినవారని తెలిపారు. కరోనా సందర్భంగా నియంత్రించడంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషించారని తెలిపారు. డబ్ల్యూహెచ్ఓ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని ఆశా వర్కర్లకు అవార్డును కూడా ప్రకటించిందని తెలిపారు. గతంతో పోలిస్తే ఈ కాలంలో ఆశాలకు పని భారం విపరీతంగా పెరిగిందన్నారు. ప్రభుత్వం స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని ఆశాలు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, లింగాల చిన్నన్న, అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి సుజాత, జిల్లా నాయకులు రాధ, లక్ష్మి, ఆశ, శాంత పాల్గొన్నారు.

కడెం : ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆశాలు మాట్లాడుతూ గ్రామాల్లో ఏలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా కీలక పాత్ర పోషించి సేవలందించడంలో ముందుంటున్నామని తెలిపారు.



కడెం :

జీఓ 142 రద్దు చేసేదాకా పోరాటం ఆగదు

- కలెక్టరేట్ ఎదుట వైద్యారోగ్య ఉద్యోగుల ధర్నా



నవతెలంగాణ-నిర్మల్

ప్రజారోగ్య వైద్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించి రేషనైజేషన్ పేరిట ప్రభుత్వం తీసుకొస్తున్న జీవో 142ను రద్దు చేసేదాకా పోరాటం ఆగదని వైద్యారోగ్య శాఖ ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు వెల్లడించారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ జీవో 142 ఆరోగ్య శాఖ ఉద్యోగుల హక్కులను కాలరాసేలా ఉందని విమర్శించారు. జిల్లాలో పదిమంది కొత్త హెల్త్ అసిస్టెంట్లు హెల్త్ ఎడ్యుకేటర్లు మహిళా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు లెప్రసీ విభాగంలో పనిచేసే ఏపీఎంలు డిపిఎంవోలు మలేరియా విభాగంలో పనిచేసే సబ్ యూనిట్ అధికారుల పోస్టులు మొత్తం రద్దవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పోస్టులన్నింటిని పక్క జిల్లాలకు తరలించారని విమర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల విభజన విషయంలోనూ సమతూకం పాటించలేదని, కొన్ని మండలాల్లో పీహెచ్‌సిల జాడ లేకుండా పోయిందని, ఈ విషయంలో ప్రభుత్వం జీవోను సవరించాలని డిమాండ్ చేశారు. డిహెచ్ కార్యాలయంలో పనిచేసే కొందరు అధికారులు మంత్రి హరీష్ రావును ప్రిన్సిపల్ సెక్రటరీని తప్పుదోవ పట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జీవోను అమలు చేయకుండా నిలుపుదల చేయాలని, అన్ని సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరిపిన తర్వాత నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దశల వారి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. వచ్చేనెల 5న డైరెక్టర్ కార్యాలయం ముట్టడి ఉంటుందని, అయినప్పటికీ ప్రభుత్వం జీవో సవరణ విషయంలో చర్యలు తీసుకోకపోతే వచ్చే నెల 10 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ప్రకటించారు. అనంతరం కలెక్టర్, డిఎంఅండ్‌హెచ్ఓకు వినతి పత్రాలు అందజేశారు. ధర్నాలో జేఏసీ నాయకులు డాక్టర్ రాజేందర్, డాక్టర్ శ్రీనివాస్, 3194 జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కన్నయ్య, కోశాధికారి వేణుగోపాలరావు, నాయకులు రమణారెడ్డి, సురేష్, సరస్వతి, మాధురి, విమల, ఉమారాణి, శాంత, ప్రేమలత, సలీం, సోమనాథ్, రాజు, అన్ని కేడర్ల ఉద్యోగులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



మద్దతు తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

అంగన్వాడీల సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరేల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు రాజేశ్వర్, కల్లపెల్లి గంగామల్లేష్, అంగన్వాడీ యూనియన్ మండల బాధ్యులు సుశీల, సిడాం లక్ష్మి, బాలే హేమలత, సంగీత, పద్మ కృష్ణవేణి, పంచపూల, అర్చన పాల్గొన్నారు.

తాండూర్ : అంగన్వాడీల డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బెల్లంపల్లి కాంగ్రెస్ ఆశావాహ అభ్యర్థి నాతర స్వామి అన్నారు. సోమవారం భీమిని, కన్నెపల్లి మండలాల్లో అంగన్వాడీల సమ్మె శిబిరాలను సందర్శించి మద్దతు పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీలతో వెట్టిచాకిరి చేయించుకుంటోందని ఆరోపించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శులు గెల్లి జయరాం యాదవ్, సిలివేరి సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అఫ్జల్, భీమిని మండల యూత్ అధ్యక్షులు సురేష్ పాల్గొన్నారు.

ఏజెన్సీ గిరిజనేతరులకు న్యాయం చేయాలని ధర్నా



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

తరతరాలుగా నివసిస్తున్న ఏజెన్సీలోని గిరిజనేతరులకు న్యాయం చేయాలని నాన్ ట్రైబల్ జెఎసి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏజెన్సీలో స్వాతంత్ర్యం రాక ముందు నుంచి నివసిస్తున్న గిరిజనేతరుల భూములకు హక్కులు కల్పించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 50శాతం ఉద్యోగాలు గిరిజనేతరులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. తరతరాలుగా నివసిస్తున్న గిరిజనేతరులకు అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం హక్కులు కల్పించాలని పేర్కొన్నారు. రాస్తారోకోలో లాహనే సంజీవ్, గిరి, ఉత్తం, సోమురే నాగోరావ్ పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

ఆదిలాబాద్‌రూరల్: బంగారుగూడ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలికల క్రీడాపోటీలను అదనపు కలెక్టర్ శ్యామలదేవి సోమవారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు క్రీడాపోటీలు కొనసాగనున్నాయని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు సెప్టెంబర్ 27న బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రాథోడ్ రమేష్, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు గోవర్ధన్‌రెడ్డి, క్రీడల అధికారి పార్థసారధి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
2
మంగళవారం | సెప్టెంబర్ 26, 2023 | www.navatelangana.com

మత్స్యకారుల అభివృద్ధి కోసమే చేప పిల్లల పంపిణీ

నవతెలంగాణ-సిరికొండ



మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని సిరికొండ సర్పంచ్ ఓరుగంటి నర్మదా పెంటన్న అన్నారు. సోమవారం మండలంలోని పలు చెరువుల్లో మత్స్యకారులతో కలిసి లక్ష చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమం కోసం, రాష్ట్రంలో చేపల ఉత్పత్తిని గణనీయంగా పెంచాలన్నా ఉద్దేశంతో ఉచితంగా చేపపిల్లలను సరఫరా చేస్తుందని వారు పేర్కొన్నారు. మత్స్యకారులు ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో జింక లక్ష్మణ్, లస్మన్న, దావుల పోశన్న, బొడ్డు రవి, జింక గంగన్న, పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు : ఎస్సై డి.సునీల్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మండలానికి చెందిన తగ్రే అంజలి, బనియ సరస్వతిలు కేంద్ర పారామిలిటరీ బలగాలైన బీఎస్ఎఫ్‌సీఆర్‌పీఎఫ్‌లో ఎంపికైనందుకు, స్థానిక ఎస్సై దుబ్బాక సునీల్ వారిని సోమవారం శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై ఇరువురికి ట్రైనింగ్ పూర్తి చేసి ఉద్యోగంలో స్థిరపడాలని ప్రోత్సహించారు. దీంతో తల్లిదండ్రులలో పాటు మండలానికి మంచి పేరు ప్రతిష్టలు తేవాలని సూచించారు. స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ శిక్షణ తమకు ఎంతో ఉపయోగపడిందని యువతీలు పేర్కొన్నారు. త్వరలో వెలువడే పోలీసు ఫలితాల్లో సైతం అనేక మంది యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశముందని ఎస్సై పేర్కొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

- అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి
- సమ్మె విరమణకు ప్రభుత్వం కృషి చేయాలి
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమేష్ డిమాండ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్‌వాడీ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ కొనసాగుతున్న సమ్మె 15వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమేష్ పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు చర్చించి, పరిష్కరించని రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి, సమ్మెపై నిర్బంధానికి నిరసనగా రాష్ట్ర దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారం కోసం సమ్మె విరమణ కోసం చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని సమ్మెపై నిర్బంధం ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అంగన్‌వాడీలపైన అదేవిధంగా సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులపైన బనాయించిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రమాద బీమా రూ.10లక్షలు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10లక్షలు, హెల్పర్లకు రూ.5 లక్షలు ఇవ్వాలని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే జేఏసీతో చర్చలు జరపాలని లేనిపక్షంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలకు సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, లింగాల చిన్నన్న సహాయ కార్యదర్శి నవీన్‌కుమార్, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, అంగన్‌వాడీ జిల్లా నాయకులు మధునిక, పార్వతి, సుభద్ర, రమణ, కళావతి, రత్నమాల పాల్గొన్నారు.



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

లక్ష్మణచాంద : తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు ఉద్యోగులు మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేసి, క్రమబద్ధీకరించాలని అన్నారు. ఉచిత ఆరోగ్యబీమా కల్పించి ఆదుకోవాలని అన్నారు. ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి లలిత, మండల అధ్యక్షురాలు వెంకట్ లక్ష్మి, కార్యదర్శి భాగ్యలక్ష్మి, విజయ, వరలక్ష్మి, పద్మ, కె.సునీత, రాజమణి, సుజాత మండల అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



లక్ష్మణచాంద : అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలుపుతున్న శ్రీహరిరావు

అంగన్‌వాడీలు, ఆశాలకు శ్రీహరిరావు మద్దతు

తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న ఆశా కార్యకర్తలకు, అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మెకు సోమవారం కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షులు కుచాడి శ్రీహరిరావు సమ్మె శిబిరాన్ని సందర్శించి, సంఘీబావం తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కారించి, ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, అట్ల రాంరెడ్డి, ఈటెల శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, ఒడ్నాల రాజేశ్వర్, సమ్మెట రవి పాల్గొన్నారు.

పర్యాటకులను ఆకర్షించేందుకు ఎన్నో పర్యాటక ప్రదేశాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పర్యాటకులను ఆకర్షించే విధంగా జిల్లాలో అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు ఎన్నో ఉన్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం పట్టణంలోని నూతన అంబేద్కర్ భవన్‌లో ప్రపంచ పర్యటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రభుత్వం జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేస్తుందని అన్నారు. పర్యాటక ప్రదేశాలకు టూరిజం ప్రమోషన్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లాలో నిర్వహిస్తున్న స్వీప్ కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, పాటలు, వ్యాచరచన పోటీలు, అలాగే ఫోటో ప్రదర్శన వంటి పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీలలో గెలుపొందిన వారికీ ఈనెల 27న జడ్పీ సమావేశ మందిరంలో బహుమతులను ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ కిషన్, పర్యాటక శాఖ అధికారి రవికుమార్, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన నూతన ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు



నవతెలంగాణ-సిరికొండ

రెండో సారి ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలుగా కుస్రం నీలాదేవి ఇటీవల నియామకమయ్యారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావ్, ఐకేరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. నాపై నమ్మకంతో రెండో సారి పదవి బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

108, 102 వాహనాలను తనిఖీ

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలానికి సంబంధించిన ప్రభుత్వ 108, 102 వాహనాలను జిల్లా కోఆర్డినేటర్ బాదావత్ తిరుపతి సోమవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా అత్యవసర సమయాల్లో 108 వాహనంలోని పరికరాలు (మల్టీచానల్ మానిటర్, సెక్షన్ ఆపరేటర్, బీపీ ఆపరేటర్) సక్రమంగా ఉన్నాయో లేవో తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు ఇంటి నుంచి ఆస్పత్రికి, ఆస్పత్రి నుంచి ఇంటికి 102 వాహనాన్ని వాడుకోవాలని సూచించారు. 108 అత్యవసర వాహనంలోని ఆక్సిజన్ సిలెండర్ పనితీరు, ఉద్యోగుల సమయపాలన పాటిస్తూ గోల్డెన్ అవర్‌లో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించే విధంగా కృషి చేయాలని కోరారు. అంతే కాకుండా ఇచ్చోడ, నేరడిగొండ మండలానికి సంబంధించిన 108, 102 వాహనాలని తనిఖీ నిర్వహించినట్టు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట108 పైలెట్స్ ఎండీ అలీం, నరేందర్, మహేష్, ఈటీఏంలు సతీష్, కృష్ణ, శ్రీనివాస్ 102 క్యాప్టెన్ భావ్ సింగ్ పాల్గొన్నారు.

నూతన ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు



నవతెలంగాణ-కుభీర్

ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన ప్రధానోపాధ్యాయుడిగా సోమవారం ఎస్.నారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదీలిల్లో భాగంగా ఇక్కడ పని చేసిన బి.చంద్రకాంత్ ప్రధానోపాధ్యాయులు లోకేశ్వరం మండలంలోని మన్మథ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానం సారంగాపూర్ మండలంలోని చించోలి(బి) ఉన్నత పాఠశాల నుంచి పార్డి(బి) ఉన్నత పాఠశాలకు ప్రమోషన్‌పై వచ్చారు. ఈ సందర్భంగా నూతన ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించి మంచి ఉన్నత విద్యను అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించి, నాణ్యమైన విద్యను అందించేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాస్, నారాయణ, జోషి ఉన్నారు.

ఉత్సాహంగా జోనల్ స్థాయి జూడో ఎంపిక పోటీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జూడో క్రీడలో గొప్ప భవిష్యత్తు ఉందని, గొప్ప నైపుణ్యాలను పెంపొందించుకొని గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి అన్నారు. సోమవారం జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అండర్-14, 17 సంవత్సరాల బాలబాలికల జోనల్ స్థాయి జూడో ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. ఈ ఎంపిక పోటీలను ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావుతో కలిసి జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి క్రీడలను ప్రారంభించారు. జిల్లాలో ఎంతోమంది ప్రతిభగల క్రీడాకారులు ఉన్నారని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని జిల్లా కేంద్రంలో క్రీడా పాఠశాల ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. కార్యక్రమంలో పేటా సంఘం కార్యదర్శి స్వామి, జూడో కోచ్ రాజు, మహేష్ పాల్గొన్నారు.

రిమ్స్ ఎదుట వికలాంగుల నిరసన

- సదరం సర్టిఫికెట్ ఇవ్వాలని డిమాండ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



అధికార పార్టీ నాయకులు చెప్పిన వాళ్లకే సదరం సర్టిఫికెట్ ఇస్తున్నారని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి ఆరోపించారు. అర్హులకు అన్యాయం జరుగుతుందని పేర్కొంటూ సోమవారం రిమ్స్ డైరెక్టర్ ఛాంబర్ ఎదుట వికలాంగులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిమ్స్‌లో సదరం సర్టిఫికెట్ పొందేందుకు అనేక మంది అర్హులైన వికలాంగులు, అంధులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల అలసత్వం కారణంగా వికలాంగులు, అంధులు ప్రభుత్వ ఫలాలు పొందలేకపోతున్నారని తెలిపారు. మరోపక్క అధికార పార్టీ నాయకులు చెప్పిన వెంటనే అర్హులు కాకపోయినా వైద్యులు సదరం సర్టిఫికెట్ జారీ చేస్తున్నారని పేర్కొన్నారు. తాజాగా ఓ బోదకాలు వ్యక్తికి సర్టిఫికెట్ అందజేయడమే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు, వైద్యులు స్పందించి అర్హులైన వారందరికీ సదరం సర్టిఫికెట్ జారీచేయాలని లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా అర్హులైన వికలాంగులను, అంధులను సమీకరించి, పెద్ద ఎత్తున నిరసన చేపడుతామని స్పష్టం చేశారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ జైనథ్ మండల అధ్యక్షుడు పిడుగు స్వామి, ప్రమోద్‌రెడ్డి గజానన్, ఫయిమ్, శ్రీను ఉన్నారు.

రాజకీయంగా ఎదుర్కొనలేకనే కుట్రలు

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు



మాట్లాడుతున్న వెడ్మ బొజ్జు

నవతెలంగాణ-ఉట్నూర్

రాజకీయంగా ఎదుర్కొనలేకనే నాపై సోషల్ మీడియాలో కుట్రలు చేసి వైరల్ చేస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల డిల్లీలో జరిగిన ఆదివాసీ సంఘ నాయకుల సమావేశంలో జాతీని సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మరింత అభివృద్ధిపై, ఆదివాసీ, లంబాడా తెగల మధ్య వ్యత్యాసం గురుంచి మాట్లాడటం జరిగిందన్నారు. కానీ నా మాటలను వక్రీకరిస్తు లంబాడా నాయకులు జాన్సన్ నాయక్, రాథోడ్ రమేష్ అనుచరులు, ఉపాధ్యాయులు ఉన్నారని, ఇటువంటి చర్యలు ప్రభుత్వ ఉద్యోగులై ఉండి వైరల్ చేయడం తగదన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కొనలేక సోషల్ మీడియాలో వైరల్ చేయడం అత్యంత బాధాకరమని అన్నారు. ఇలాంటి విష ప్రచారాలు మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎవరి జాతుల అభివృద్ధి కోసం, హక్కుల కోసం వారు మాట్లాడకపోతే వారు జాతి ద్రోహులగా మిగులుపోతారని తెలిపారు. అదే విధంగా రాజకీయ లబ్ధికోసం గిరిజనేతరులను వాడుకోవడం మంచిదికాదన్నారు. ఒకప్పుడు ఏజెన్సీలోని గిరిజనేతరులకు ఇందిరమ్మ ఇండ్లు, రైతులకు పహానీలు వచ్చాయన్నారు. ఇప్పుడు ఎందుకు ఆగిపోయాయో గిరిజనేతరులు తెలుసుకోవాలన్నారు. నేను లంబాడా సోదరులకు, గిరిజనేతరులకు వ్యతిరేకం కాదని తెలిపారు. ఖానాపూర్ నియోజకవర్గంలో బయటి వ్యక్తులు వచ్చి రాజకీయం చేశారన్నారు. మహారాష్ట్ర రాష్ట్రంలో గిరిజనేతరులకు భూముల కొనుగోలు, అమ్మకాలు ఉన్నాయని, మన రాష్ట్రంలో అప్పుడు సవరణ చేయకపోవడంతో గిరిజనేతరులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గిరిజనేతరులకు ఎవరు ద్రోహం చేస్తున్నారో గ్రహించాలని కోరారు. కుల, మతాలకు అతీతంగా అందరితో కలిసి ముందుకు వెళతానని, నాపై వచ్చే ఆరోపణలు ఎవరు నమ్మవద్దని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు భీమన్న, సంతోష్, సాయి, సాహెబ్ రావ్, ఇంద్రవెల్లి మండల అధ్యక్షుడు ఉత్తమ్ ఉన్నారు.

త్వరలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవర్స్ ట్రైనింగ్ కొత్త బ్యాచ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో హెవీ మోటర్ వెహికల్ డ్రైవర్స్ ట్రైనింగ్ కొత్త బ్యాచ్ త్వరలో ప్రారంభించనున్నట్లు డిపో మేనేజర్ కల్పన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు హెవీ మోటార్ డ్రైవింగ్ నేర్చుకోవడానికి ఆదిలాబాద్ డిపో కార్యాలయంలో సంప్రదించాలని ఆమె సూచించారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాం 30 రోజుల పాటు ఉంటుందని తెలిపారు. దీనికి ఫీజు రూ.15వేల 600 ఉంటుందని ఆసక్తిగల అభ్యర్థులు తప్పనిసరిగా లైట్ మోటర్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు ఆదిలాబాద్ డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్‌పెక్టర్ జీ.విష్ణు లేదా యూసుఫ్ సెల్‌ఫోన్ నెంబర్ 7382840166, 7382840349 సంప్రదించాలని సూచించారు.

పారిశుధ్య పనులు ముమ్మరంగా చేయించాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

పారిశుధ్య పనులను ముమ్మరంగా చేయించాలని ఎంపీడీఓ రాథ అన్నారు. సోమవారం మండలంలో ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని పంచాయతీ కేంద్రాలలో, దాని అనుబంధ గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేయించాలని సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం వహించకుడదని, గ్రామాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, లేకుంటే డెంగీ దోమలు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. అంతకు ముందు జవహర్‌నగర్‌లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ వైద్యశిబిరం నిర్వహిస్తున్న ప్రదేశాన్ని సందర్శించారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్‌లు ప్రతి ఇంటికి వెళ్లి, వ్యాధులపై అవగాహన కల్పించి తగు జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ పర్యవేక్షణ అధికారి దేవిదాస్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె

- సమ్మె విరమించాలని కోరిన డీఈఓ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగిస్తామని మధ్యాహ్న భోజన కార్మికుల స్పష్టం చేశారు. ఏఐటీయూసీ అనుబంధ సంఘం మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. కాగా సోమవారంతో ఈ సమ్మె ఆరో రోజుకు చేరుకుంది. ఈ సమ్మె శిబిరాన్ని డీఈఓ మాట్లాడారు. ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసిందని అన్నారు. వేతనాలు వస్తాయని సమ్మె విరమించాలని కార్మికులను కోరారు. కార్మికులు మాట్లాడుతూ గతంలో ఇలాగే చెప్పారని, ఇప్పుడు సమ్మె పరిస్థితి లేదని అన్నారు. అకౌంట్‌లో వేతనాలు పడే వరకు తమ సమ్మెను విరమించమని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న కార్మికుల సమస్యల పరిష్కరంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. కార్మికులకు పెంచిన వేతనాలు ఇవ్వకుండా ఆర్థిక ఇబ్బందులకు ప్రభుత్వం గురి చేస్తోందన్నారు. పది నెలలుగా కోడి గుడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. విద్యాశాఖాధికారి బిల్లులు వచ్చాయని చెబుతూ నెలలు గడుస్తున్న ఇప్పటికి చెల్లించలేదన్నారు. పెంచిన వేతనాలు ఏరియర్స్‌తో సహా చెల్లించాలని, పెండింగ్ వేతనాలు, బిల్లులను వెంటనే విడుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఉన్నారు.



గెస్ట్ లెక్చరర్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ, ఇంగ్లీష్ సబ్జెక్టులలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి ధరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ సబ్జెక్టుల్లో 50శాతం కలిగి ఉండి, సెట్, నెట్ లేదా పీహెచ్‌డీ అర్హత కలిగిన వారికి, బోధన అనుభవం గల అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. వివరాలకు కళాశాలను సంప్రదించాలని సూచించారు.

ఇతరులతో సరుకులు పంపిణీ చేస్తే ఊరుకునేదిలేదు

• కార్గో బస్సును అడ్డుకొని నిరసన తెలిపిన అంగన్‌వాడీలు

నవతెలంగాణ-దహెగాం

అంగన్‌వాడీలు చేయాల్సిన పనులను ఇతరులతో చేయిస్తే ఊరుకునేదిలేదని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్(సీఐటీయూ) జిల్లా నాయకురాలు వజ్రమ్మ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సరుకులతో కూడిన కార్గో బస్సు రావడంతో అడ్డుకొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా సమ్మె చేస్తుంటే స్పందించి సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఏమాత్రమూ పట్టించుకోకుండా పంచాయతీ కార్యదర్శులతో అంగన్‌వాడీ సెంటర్లను తెరిపించడం, సరుకులను పంపిణీ చేయడం సరికాదన్నారు. తమ న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చే వరకు సరుకుల పంపిణీని అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు జయ, మమత, కల్పన, లక్ష్మీ రూప, ఈశ్వరి పాల్గొన్నారు.

మనస్తాపంతో ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-సిర్పూర్(టి)

చింతకుంట గ్రామానికి చెందిన కోట కళావతి(42) అనే మహిళా గత ఐదు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతూ తగ్గకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్టు కౌటాల సీఐ సాదిక్‌పాషా, ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. సోమవారం కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోట కళావతి భర్త పర్వతాలు గత కొన్ని సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా తన ఇద్దరు ఆడపిల్లలను, అత్తమ్మను కూలి పనిచేసుకుంటూ వారిని పోషిస్తుండేది. తన ఇద్దరు కుమార్తెలను సిర్పూర్ మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో చదివించేది. గత ఐదు రోజుల క్రితం జ్వరం రావడంతో బాధపడుతూ ఇంటి వద్దనే ఉంటుంది. వైద్యం చేయించినప్పటికీ జ్వరం తగ్గకపోవడంతో సోమవారం ఉదయం ఇంటిలో అత్తమ్మ నాగక్క కూలి పనికి వెళ్లగా ఎవరు లేని సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమార్తె కోట స్రవంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు పోలీసులు తెలిపారు.

మున్సిపల్ కౌన్సిలర్ల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మున్సిపల్ కౌన్సిలర్ల సమస్యలు పరిష్కరించాలని పురపాలక కౌన్సిలర్ ఫోరం రాష్ట్ర చైర్మన్ బుక్యా రాము నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ బొర్కాడే హేమంత్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేలకు ఎంపీలకు ఇచ్చిన మాదిరి కౌన్సిలర్లకు కూడా పదవి కాలం పూర్తయిన తర్వాత పెన్షన్ మంజూరు చేయాలన్నారు. మున్సిపాలిటీలపై కలెక్టర్లకు ఉన్న అధికారాలను తక్కువ చేసి కౌన్సిల్‌కు పూర్తీ అధికారాలు ఇవ్వాలన్నారు. సభ్యులకు హెల్త్ కార్డులు అందజేయాలన్నారు. మేయర్ చైర్మన్‌లకు రూ.లక్ష, డిప్యూటీ మేయర్, వైస్ చైర్మన్‌లకు రూ.75000, కౌన్సిలర్‌లకు రూ.25000 గౌరవ వేతనం చెల్లించాలన్నారు. మహిళ కౌన్సిలర్లకు వార్డుల్లో సమస్యల పరిశీలన కోసం ద్విచక్ర వాహనాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద నిలిచిపోయిన నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. హైదరాబాద్‌కు వివిధ పనుల నిమిత్తం వస్తున్న మేయర్, చైర్మన్‌లకు అతిథి గృహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఫోరం జిల్లా చైర్మన్ జయచందర్, నాయకులు శివకుమార్, భాను, శివప్రసాద్, రాజేందర్, సుచిత్, ఎల్లేష్ పాల్గొన్నారు.

29న గిరిజన డివిజనల్ స్థాయి క్రీడా పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల డివిజనల్ క్రీడా పోటీలు ఈ నెల 29న నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారిని రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడ పోటీలకు జిల్లా గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి అధ్యక్షతన ఏటీడీఓలు క్షేత్రయ్య, కమర్ హుస్సేన్, పురుషోత్తంల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని, ఈ పోటీలలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, ఆర్చరీ, చెస్, క్యారమ్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారని, ఎంపికైన విద్యార్థులు త్వరలో జరిగే జోనల్ స్థాయి పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు.

పండిట్ దీనదయాల్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా సోమవారం కాగజ్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దీనదయాల్ హైందవ రాష్ట్ర సిద్దాంతకర్తగా బీజేపీకి సేవలందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, నాయకులు చన్కపురి గణపతి, లెండుగురె శ్యాంరావు, తరుణ్‌లోయ, వీరభద్రచారి, ఆదె వసంత్, పుల్ల అశోక్, గౌత్రె గోపాల్, దోతుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత మండలంగా తీర్చిదిద్దాలి



నవతెలంగాణ-కౌటాల

ప్లాస్టిక్ రహిత మండలంగా తీర్చిదిద్దాలని సర్పంచ్ వాజ్జెల మౌనీష్ అన్నారు. మండల కేంద్ర వారసంతలో కార్యదర్శి సాయికృష్ణతో కలిసి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని వర్తక వ్యాపారులందరికీ అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించకుంటే జరిమానా విధిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వర్తకులకు సూచించారు. వర్తకుల వద్ద ఉన్న కవర్లను తీసుకున్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

నవతెలంగాణ-కౌటాల

విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ముత్తంపేట్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు జి హన్మంతు అన్నారు. తన పరిధిలోని బారెవాడ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాల పరిసర ప్రాంతాలను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల చుట్టూ అపరిశుభ్రత తొలగించాలని, విద్యార్థుల సామర్థ్యాని పరిశీలించి విద్యా నైపుణ్యాన్ని మరింత పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు.

21 రకాల నైవేద్యాల సమర్పణ

నవతెలంగాణ-బెజ్జూర్

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలకేంద్రంలోని రంగనాయక ఆలయంలో సోమవారం గణనాథుడికి 21 రకాల నైవేద్యాలను భక్తులు అర్పించి ఘనంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి ఎస్సై విక్రమ్, వాసవిక్లబ్ నాయకుడు రాచకొండ నాగేశ్వర్‌రావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు మహేష్, నరేందర్‌గౌడ్, పుల్లూరి సతీష్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

• సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్



ఆశాల సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్

నవతెలంగాణ-కెరమెరి

ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ముంజం శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశా వర్కర్లు చేపట్టిన సమ్మెకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల చేత అనేక పనులు చేపిస్తున్నప్పటికీ వారి సమస్యలను పట్టించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. పెరుగుతున్న ధరల అనుగుణంగా ఆశాలకు రూ.18000లకు పెంచి, పిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలన్నారు. ఆశాలకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. హెల్త్ కార్డులతో పాటు, ప్రభుత్వ బీమా రూ.5 లక్షలు వర్తింపజేయాలన్నారు. రీటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్, అర్హత కలిగిన ఆశా వర్కర్లకు ఏఎన్ఎం, జీఎన్ఎం పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆశా వర్కర్ల పక్షాన ఆందోళన ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అరుణ, సవిత్రబాయి, భారతి, పద్మబాయి, కన్ని బాయి, కళావతి, రంభ బాయి పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : ఆశా వర్కర్లకు స్థిర వేతనం రూ.18000 వెంటనే ప్రకటించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. ముందుగా ఇచ్చిన నోటీసు మేరకు సోమవారం నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 28 వేల మంది ఆశ వర్కర్లు పేదలకు వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. వీరంతా పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన వారేనని తెలిపారు. అటువంటి ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం తాత్సారం చేయడం సరైన విధానం కాదన్నారు. పని భారాన్ని తగ్గించాలని స్థిర వేతనాన్ని అమలు చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి సమ్మెలోకి వెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారంపై దృష్టి కేంద్రకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప, నవీన, భారతి, అమృత, దేవి, సుజాత, సుమిత్ర పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : ఆశాల కార్యకర్తల నిరసన

పెంచికల్‌పేట్ : ఆశావర్కర్ల డిమాండ్‌లు నెరవేర్చాలని సోమవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమాచారి ఆశావర్కర్లతో కలిసి నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తల పారితోషికాలను రూ.18 వేలకు పెంచి ఫిక్స్ వేతనం నిర్ణయించాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగభద్రత, హెల్త్‌కార్డులు, ప్రమాదబీమా సౌకర్యం రూ.ఐదు లక్షలు ఇవ్వాలని, కరోనా రిస్క్ అలవెన్సు 16 నెలల బకాయిలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, లక్ష్మీ, శిరీష, కవిత, రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్ : నిరసనలో పాల్గొన్న కృష్ణమాచారి

అంగన్‌వాడీలపై నిర్లక్ష్య వైఖరి విడనాడాలి

• సీఐటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి త్రివేణి



ఆసిపాబాద్ కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న సమ్మెలో మాట్లాడుతున్న త్రివేణి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్షవైకరి విడనాడాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి త్రివేణి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మెకు సోమవారం ఆమె మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 15 రోజులుగా సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీల సేవలు వెలకట్టలేనివని గుర్తు చేశారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టిన అంగన్వాడీలను తొలగిస్తామని బెదిరించడం సరికాదన్నారు. ఐసీడీఎస్ మంత్రి సత్యవతి రాథోడ్ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి అప్రజాస్వామికంగా మంత్రి సవరణ ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వనిత, ధనలక్ష్మి, మంజుల, భార్గవి, రమ, పద్మ, సునీత, సులోచన పాల్గొన్నారు.



ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు అంగన్‌వాడీల వినతి



కెరమెరిలో బతుకమ్మ ఆడుతూ అంగన్‌వాడీల నిరసన

అంగన్‌వాడీలకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సంఘీభావం

బెజ్జూర్ : అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశావర్కర్ల డిమాండ్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట 15 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లకు బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సంఘీభావం తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆయాలు ఆయనకు వినతిపత్రం అందజేశారు. వారిని ఉద్దేశించి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, రూ.ఐదు లక్షల రిటైర్డ్‌మెంట్ బెన్‌ఫిట్స్‌తో పాటు పెన్షన్ అందజేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కార్యాలయానికి రాకుండానే నెలకు రూ.3,36,000 వేతనం తీసుకుంటున్నారు కానీ అంగన్‌వాడీ, ఆశావర్కర్లకు మాత్రం కనీస వేతనం చెల్లించడంలేదని విమర్శించారు. ప్రభుత్వం సూచించే అన్ని పనులు చేపడుతున్నా వీరికి న్యాయం జరగడంలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులుగా అంగన్‌వాడీ, ఆశావర్కర్లు సమ్మె చేస్తున్నా ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టించుకోవడంలేదని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీ, ఆశావర్కర్లకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆత్రం సాయి, మహిళా అధ్యక్షురాలు ఎనుక అమృత, మాజీ సర్పంచ్ ఎల్కరి రమేష్, మాజీ ఎంపీటీసీ సారయ్య, రాజలింగు, సూర్ల ఇస్తారి, పోచం, సల్మాన్, రాకేష్, ఖాజాబాయ్ పాల్గొన్నారు.

కెరమెరి : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆగదని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు త్రివేణి, గంగామణి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదట గత 15 రోజులుగా చేస్తున్న సమ్మెలో పాల్గొని బతుకమ్మ ఆడి నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వినర్ కూటికల ఆనంద్ రావ్, అనసూయ, సావిత్రి, గుణసుందరీ, అనీత, ప్రమీల పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను షరతుల్లేకుండా అమలు చేయాలి



రెబ్బెనలో సమ్మె నోటీసు అందజేస్తున్న 2వ ఏఎన్ఎంలు

నవతెలంగాణ-దహెగాం

ఇచ్చిన హామీలను శరతులు లేకుండా అమలుచేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బి మధూకర్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మెడికల్ ఆఫీసర్ స్పందనకు ఎన్‌హెచ్ఎం రెండో ఏఎన్ఎంలు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బి మధూకర్ మాట్లాడుతూ బేషరతుగా రెగ్యులర్ చేయాలని కోరుతూ గత నెల 16 నుండి ఈ నెల మూడవ తేదీ వరకు నిరవధిక సమ్మెను నిర్వహించడం జరిగిందని, రెండో ఏఎన్ఎంలను బేషరతుగా రెగ్యులరైజేషన్ కొరకు పోరాటం చేస్తే ప్రభుత్వ దానిని ఒప్పుకోకపోగా వంద వాతం గ్రాస్ శాలరీతో పాటు మరో 17 డిమాండ్లను పరిశీలించడానికి ఒక త్రీ సభ్య కమిటీ వేసిందన్నారు. 15 రోజుల్లోగా మాకు రావాల్సిన పీఆర్‌సీ బకాయిలతో పాటు సమ్మె కాలానికి సంబంధించిన జీతాన్ని చెల్లిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. త్రీ సభ్య కమిటీ వేశారు కానీ మాకు ఇచ్చిన హామీలలో ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని, చివరికి కమిటీ వేసి దాదాపు నెల రోజులు కావస్తున్నా ఆ కమిటీ ఒక్కసారి కూడా సమావేశం కాలేదని, మమ్మల్ని కమిటీ ముందుకు పిలవలేదన్నారు. ప్రభుత్వం చెప్పిన 15 రోజుల గడువు ఎప్పుడో దాటిపోయిందని, అందుకే సమ్మె సందర్భంగా మాకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో రెండో ఏఎన్ఎంలు అక్టోబర్ ఐదో తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామన్నారు. తహసీల్దార్ ఇట్టి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అక్టోబర్ ఐదో తేదీలోపు మా సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని అన్నారు. కేసీఆర్ ఎన్నికల సమయంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరిని పర్మినెంట్ చేస్తామని ముఖ్యమంత్రి అయిన తర్వాత ఏ ఒక్క ఉద్యోగిని పర్మినెంట్ చేసిన దాఖలాలు లేవన్నారు. వెంటనే ఎన్నికల హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెండో ఏఎన్ఎం యూనియన్ జిల్లా నాయకురాళ్లు జ్యోతి, సత్యవాణి, లక్ష్మి, శాంత, అనిత, బేబీ పాల్గొన్నారు.

రెబ్బెన : రాష్ట్రంలో ఎన్‌హెచ్ఎం స్కీంలో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలను సమ్మెలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎలాంటి శరతులు లేకుండా అమలుచేయాలని, లేనిపక్షంలో అక్టోబర్ ఐదో తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రెండో ఏఎన్ఎంలు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రమీల, రెండో ఏఎన్ఎంలు తులసీ, పద్మ పాల్గొన్నారు.

దళితులకు వంద యూనిట్ల కరెంటు ఉచితంగా ఇవ్వాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 342 ప్రకారం ప్రతి దళిత కుటుంబానికి 101 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. సోమవారం సిర్పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం ఏఈ ఇర్ఫాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు, పెట్టుబడి దారులకు, గెజిటెడ్ ఉద్యోగులకు, ధనవంతులకు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తుందని, ఇల్లు, భూమి లేని నిరుపేదలైన దళిత కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందించడంలేదని విమర్శించారు. వెంటనే అన్ని దళిత కుటుంబాలకు ఉచిత విద్యుత్ అమలుచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులం సర్టిఫికెట్ అందజేయడంలేదనే సాకుతో విద్యుత్ సబ్సిడీ ఇవ్వడంలేదని, ప్రభుత్వ ఆన్‌లైన్ డేటా ప్రకారం దళిత కుటుంబాల లిస్టు ఉందని, ప్రతి దళిత కుటుంబానికి ఉచిత విద్యుత్ అందించాలని, వంద యూనిట్లు దాటిన కుటుంబాలకు వర్తించకుండా జీఓ ఉందని, 300 యూనిట్ల వరకు ఉచితంగా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున విద్యుత్ కార్యాలయాల ముట్టడిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం రాజ్‌కుమార్, నాయకులు శంకర్, ఆనంద్, కల్లాజీ, సోమయ్య, సునీల్, భీంరావు, మాధవ్ పాల్గొన్నారు.

పులిదాడిలో లేగదూడ మృతి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని లోడ్‌పెల్లి గ్రామానికి చెందిన లావుడె రమేష్‌కు చెందిన లేగదూడను మేతకు వెళ్లిన చోట ఆదివారం పులి చంపినట్టు డిప్యూటీ రేంజ్ అధికారి ప్రభాకర్ తెలిపారు. ఆదివారం సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించినట్టు తెలిపారు.

రైతులకు పండ్లు పంపిణీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో సోమవారం యూరియా పంపిణీ కార్యక్రమం చేపట్టగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులకు సింగిల్‌విండో చైర్మన్ అలిబీన్ అహమద్ అరటిపండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఎరువులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి ఎరువుల కోసం రైతులు వస్తున్నారని వారికి కావాల్సిన వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఓ వెంకటరమణ, కెరమెరి సింగిల్‌విండో చైర్మన్ శంకర్ పాల్గొన్నారు.

స్కూల్ విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలోని సింగరేణి హైస్కూల్లో చదివే విద్యార్థుల రాకపోకల కోసం నూతన బస్సు సేవలను సోమవారం డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి ప్రారంభించారు. సింగరేణి స్కూల్ విద్యార్థులు మాదారం, దేవాయిగూడ, గోలేటి సమీప గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉదయం పాఠశాలకు తీసుకురావడం, తిరిగి సాయంత్రం ఇంటికి తీసుకెళ్లనున్నట్టు ఆయన తెలిపారు. విద్యార్థులను సురక్షితంగా గమ్యానికి చేర్చాలని ఆయన డ్రైవర్‌కు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, ప్రధానోపాధ్యాయుడు సంతోష్, ఉపాధ్యాయుడు ఆర్లరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్ పాల్గొన్నారు.

సఖీ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన

నవతెలంగాణ-తాండూర్



తాండూర్ కేజీబీవీలో సఖీ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కౌన్సిలర్లు విజయ, భారతి విద్యార్థినులకు మహిళా చట్టాలు, సాధికారత, మొబైల్ వాడకం తగ్గించడం గురించి అవగాహన కల్పించారు. రోజు వారీ కార్యక్రమాల్లో పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. 181 మహిళా హెల్ప్‌లైన్ ద్వారా సమస్యకు పరిష్కారం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి సుమన చైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ధరలకు అనుగుణంగా వేతనం అందించాలి

నవతెలంగాణ-తాండూర్

పెరుగుతున్న ధరల అనుగుణంగా ఆశా కార్యకర్తలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగాం రాజారాం డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశా కార్యకర్తలు ప్రారంభించిన సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి, భారతీ, రేవతి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

భీమిని : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశా కార్యకర్తలు సోమవారం సమ్మె ప్రారంభించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు రూ.1000 చొప్పున 16 నెలల బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. 32 రకాల రిజిస్టర్స్‌ను వెంటనే ప్రింట్ చేసి ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

- అత్యధికంగా నమోదవుతున్న విషజ్వరాలు
- ఆస్పత్రుల్లో పెరుగుతున్న రోగుల సంఖ్య
- పారిశుధ్య లోపమే ప్రధాన కారణం

జిల్లాలో రోజురోజుకూ సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. పల్లెలు, పట్టణాలన్న తేడా లేకుండా జ్వరాలు ప్రజలను వణికిస్తున్నాయి. రెండేళ్లలో పోలిస్తే ప్రస్తుత సీజన్‌లో రోగుల సంఖ్య అధికమవుతోంది. వైద్య ఆరోగ్యశాఖ లెక్కలు చూస్తే మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. ఆ శాఖ లెక్కల కంటే రెండింతలు గ్రామాల్లో జ్వర పీడితులు సంఖ్య పెరిగాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్లపై, మురుగుగుంతల్లో నీరు నిల్వ కావడంతో దోమలు వ్యాప్తి చెంది పారిశుధ్య లోపం ప్రధాన కారణమవుతోంది. దీంతో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో పాటు అక్కడక్కడ డయేరియా కేసులు కూడా నమోదవుతున్నాయి.



నవతెలంగాణ-హాజీపూర్

జిల్లా వ్యాప్తంగా 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 3 బస్తీ దావాఖానాలు, 3 సీహెచ్‌సీలు , 149 ఉప ఆరోగ్య కేంద్రాలు, 1 మాతాశిశు ఆస్పత్రి, ఒక జిల్లా ఆస్పత్రి ఉన్నాయి. వీటితో పాటు ఆరోగ్యశ్రీ నెట్వర్క్ ఆసుపత్రులు ఉన్నాయి. వీటితో పాటు ప్రతి గ్రామానికి ఒక ఏఎన్ఎం ఉన్నారు. అయినప్పటికీ ఒక్క మంచిర్యాల పట్టణంలోనే రోజుకు 800 నుంచి 1000కి పైగా వివిధ ఆసుపత్రులకు జ్వర పీడితులు వెళ్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మంచిర్యాల జిల్లా ఆస్పత్రిలోనే రోజుకు 500 నుంచి 550 పైబడి ఓపీలు వస్తున్నారు. ఇందులో 80 శాతం సీజనల్ వ్యాధులకు గురైన వారే ఉంటున్నారు. వైరల్ జ్వరాలతో బాధపడేవారు ఎక్కువగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాల బాధితుల్లో మూడింతల మంది ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలకు మూడు పువ్వులు ఆరు కాయలుగా వ్యాపారం సాగుతోంది. వీరితో పాటు ఆర్ఎంపీల వద్ద సైతం వైద్య సేవలు పొందుతున్నారు. వీరు సూది మందు ఇవ్వకూడదని నిబంధనలు ఉన్నా వారు సూది మందుతో పాటు ఏకంగా సెలెన్ బాటిళ్లు సైతం ఎక్కిస్తున్నారు. ఈ విషయాలు తెలిసినప్పటికీ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

ఆస్పత్రుల్లో పెరుగుతున్న రోగుల సంఖ్య

పట్టణంతో పాటు గ్రామాల్లో జ్వరాలు ప్రబలడంతో జిల్లా ఆస్పత్రిలో జ్వరపీడితుల సంఖ్య పెరిగింది. అదేవిధంగా ఓపీ సంఖ్య 550 కు పెరగ్గా, ఇన్పేషంట్లు ప్రతీ రోజు 100 మందికి పైగా ఉంటున్నారు. ఒక్క చిన్న పిల్లల వార్డులోనే 50 మంది వరకు చికిత్స పొందుతున్నారు. ఓపీ విభాగంలో 70 నుంచి 80 శాతం మంది జ్వర పీడితులే ఉన్నారు. ఇందులో డెంగీ, టైఫాయిడ్, మలేరియా కేసులే ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా ల్యాబ్, ఓపీ గదుల వద్ద అందరూ జ్వరబాధితులే ఉన్నారు. దీంతో జ్వరపీడితులతో ఆస్పత్రి కిటకిటలాడుతోంది. ముఖ్యంగా అత్యవసర విభాగం, ఓపి గదులు, ల్యాబ్, మందుల పంపిణీ గది, వార్డులన్నీ జ్వరబాధితులతో నిండిపోయాయి. ఫీవర్ కేసులతో సమయం సరిపోతోందని, ఇక మిగతా టెస్టులు చేసేందుకు సమయం చాలడం లేదని ల్యాబ్ సిబ్బంది చెబుతున్నారు. డెంగీ, టైఫాయిడ్ కేసులు చాపకింద నీరులా విస్తరిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. జ్వరబాధితుల్లో ప్లేట్లెట్ కౌంట్ 1.50 లక్షలకు తగ్గకుండా ఉంటే డెంగీ సోకదని అంటున్నారు. తెల్ల రక్తకణాల సంఖ్య పడిపోతే వ్యాధి తీవ్రత పెరిగి మరణాలు సంభవించే అవకాశం ఉందని డాక్టర్లు చెబుతున్నారు. టైఫాయిడ్‌కు గురైన మనిషి కోలుకోవడానికి 20 రోజులు పడుతుందని అంటున్నారు. మెరుగైన వైద్యం అందించకుంటే పరిస్థితి విషమించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

పారిశుధ్య లోపమే ప్రాధాన కారణం

జిల్లాలో 311 గ్రామాలు 7 మున్సిపాలిటీలలో జ్వర పీడితుల సంఖ్య పెరుగటానికి ప్రధాన కారణం పారిశుధ్య లోపమనే చెప్పుకోవచ్చు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వాహణ గాడి తప్పింది. ఒక మంచిర్యాల మున్సిపల్ పరిధిలోనే అధికారుల లెక్కల ప్రకారం సుమారు 8వేల ఖాళీ స్థలాలు ఉన్నాయి. అయితే వీటి సంఖ్య ఇంకా ఎక్కుగానే ఉందని తెలుస్తోంది. వరుసగా కురుస్తున్న వర్షాలకు ఈ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. వాటిలో పందులు ఆవాసం ఉండటంతో పారిశుధ్యం లోపించి దుర్గందం వెదజల్లుతోంది. ఈ అపరిశుభ్రతతో దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులకు ప్రధాన కారణంఅవుతోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించడంతోనే వ్యాధులు విజృంభిస్తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే విష జ్వరాలు

- సంకె రవి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి



ప్రభుత్వ నిర్లక్ష్యమే విషజ్వరాలకు కారణం అవుతోంది. ఒక జిల్లా ఆసుపత్రిలోనే ఇంత మంది జ్వర బాధితులు ఉంటే ప్రయివేటు ఆస్పత్రుల్లో, గ్రామాల్లో ఇంకా ఎంత మంది వ్యాధులతో బాధపడుతున్నారనేది అధికారులు అర్థం చేసుకోవాలి. గత నెల రోజుల నుంచి వస్తున్న జ్వరాలకు ప్రజలు అల్లాడి పోతున్నారు. ప్రభుత్వం మాత్రం వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం లేదు. అన్ని గ్రామాల్లో వెంటనే ప్రత్యేక క్యాంప్‌లు పెట్టి జ్వర పీడితులకు ట్రీట్మెంట్ చేయాలి. మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలి.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం

- హరీష్ చంద్రరెడ్డి, సుపరిండెంట్ జిల్లా ఆసుపత్రి



జిల్లా ఆస్పత్రికి వచ్చే జ్వరపీడితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. ఎక్కువగా సీజనల్ జ్వరాలు, టైఫాయిడ్ కేసులు వస్తున్నాయి. బాధితులకు తొలుత వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, ఆ తరువాత చికిత్స అందిస్తున్నాం. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సాధారణ జ్వరమైనా ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలి. నిర్లక్ష్యంగా ఉంటే వ్యాధి వ్యాప్తి పెరిగే అవకాశం ఉంది. రెండు మూడు రోజులు వరుసగా జ్వరం వచ్చిన బాధితుల్లో డెంగీ లక్షణాలు కనబడుతున్నాయి. వీరికి వెంటనే పరీక్షలు నిర్వహిస్తున్నాము. ఇప్పటికైతే డెంగీ కేసులు నమోదు కాలేదు. మందులుతో పాటు ఫ్లూయిడ్స్ ఎక్కించి రక్తకణాల సంఖ్య పెంచుతున్నాం. జబ్బుల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



నవతెలంగాణ-జన్నారం

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ మంచిర్యాల జిల్లా కార్యదర్శి తోకల సరస్వతి, సీఐటీయూ మండల అధ్యక్షురాలు, నసిమా బేగం అన్నారు. గత 15 రోజులుగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు నిర్వవాదిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కనీస వేతనం రూ.26000 ఇవ్వాలన్నారు. ప్రభుత్వం స్పందించేంతవరకు దీక్షను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన అంగన్వాడీలు, లక్ష్మి, శైలజ మల్లికా శ్రీలత పాల్గొన్నారు.

ఆడపడుచులకు అండగా ప్రేమ్‌సాగర్‌రావు



నవతెలంగాణ-నస్పూర్

ఆడపడుచులకు ఎల్లప్పుడూ ప్రేమ్ సాగర్‌రావు అండగా ఉంటారని ట్రస్ట్ సెక్రటరీ కొక్కిరాల సురేఖ అన్నారు. సోమవారం నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య కాలనీ(1), ప్రశాంత్ నగర్(2), కృష్ణ కాలని(3), 4,5,16 వార్డులలో ఆడపడుచులకు సద్దుల బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవిలో లేకున్నా ప్రేమ్‌సాగర్ రావు ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటున్నారని పేర్కొన్నారు. ట్రస్టు ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పేరెంట్స్ కమిటీ భాగస్వామ్యంతో కేజీబీవీ అభివృద్ధి

నవతెలంగాణ-తాండూర్

పేరెంట్స్ కమిటీ సభ్యుల సహకారంతో కేజీబీవీలు విద్యాభివృద్ధికి కృషి చేస్తామని ఎస్‌ఓ సుమన్ చైతన్య అన్నారు. సోమవారం తాండూర్ కేజీబీవీలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి పిల్లల పురోగతి క్రీడా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతగానో అవసరం ఉంటుందని తెలిపారు. ప్రతి సమావేశానికి విద్యార్థులు తల్లిదండ్రులు హాజరై పాఠశాల అభివృద్ధి పిల్లల ప్రగతిని పర్యవేక్షించాలని కోరారు. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్ట్స్ పేరెంట్స్‌కి చూపించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి బోధన సిబ్బంది తల్లిదండ్రులు విద్యార్థినిలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికైన క్రీడాకారుడు

నవతెలంగాణ-భీమారం

డిఫరెంట్లీ ఏబుల్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, సనాతన సేవా సంస్థాన్ సంయుక్తంగా నిర్వహించే టీ-20 మూడో జాతీయ స్థాయి దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్‌కు మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన ఉప్పుమల్ల కళ్యాణ్ ఎంపికయ్యాడు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కమిటీ నిర్వహించిన దివ్యాంగ జట్టు ఎంపిక టోర్నీలో 24 రాష్ట్రాల నుంచి దివ్యాంగులు పాల్గొనగా తెలంగాణ రాష్ట్రం నుంచి కళ్యాణ్ ఎంపికయ్యాడు. ఉదయ్‌పూర్‌లో ఈ నెల 28 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహించనుండగా, ఈ టోర్నమెంట్ గిన్నీస్‌బుక్ ఆఫ్ రికార్డులో నమోదు చేయనున్నట్లు దక్షిణ భారతదేశ క్రికెట్ అండ్ డెవలప్ మెంట్ డైరెక్టర్ చంద్రఖాన్‌గిరి తెలిపారు. దీంతో తెలంగాణ నుంచి మంచి ప్రతిభ కనబర్చిన కళ్యాణ్‌ను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ట్రెజరర్ సురెంద్ర అగర్వాల్, క్రికెట్ అసోసియేషన్ మెంబర్ మనోహర్‌రెడ్డి హెచ్‌సీఏ క్రీడా మైదానంలో అభినందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నవతెలంగాణ-జన్నారం

వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎఫ్ఆర్ఓ ఆఫీసుద్దీన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అటవీ శాఖ సముదాయ భవనాల కార్యాలయ పరిసరాలను పరిశుభ్రం చేశారు. రోడ్లపై చెత్తాచెదారం ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడం వల్ల వాతావరణం కలుషితమవుతుందన్నారు. రేంజ్ అధికారులతో చుట్టుపక్కల పిచ్చి తొలగించి, ప్లాస్టిక్ వ్యర్థాలను పోగుచేసి మొక్కలను డంపింగ్ యార్డ్‌కు తరలించారు. కవ్వాల్ టైగర్ జోన్ అడవి ప్రాంతం నుంచి మంచిర్యాల నిర్మల్ ఆదిలాబాద్ వాహనాలలో వెళ్లే ప్రయాణికులు రోడ్డు పక్కన అడవిలో ప్లాస్టిక్ వ్యర్థాలను పడెయ్యకూడదన్నారు. చెత్త బుట్టలలో చెత్తను వేసి వాతావరణం కలుషితం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటింటికీ కాంగ్రెస్



నవతెలంగాణ-మందమర్రి

కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రాజా రమేష్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని శ్రీపతినగర్‌లో ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఆరు గ్యారంటీ పథకాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాజా రమేష్ మాట్లాడుతూ చెన్నూరు గడ్డపై కాంగ్రెస్ తరపున ఎన్నికల బరిలో ఉండేందుకు సింగరేణి ప్రాంత ముద్దు బిడ్డగా ముందుకు వచ్చానని తెలిపారు. స్థానికేతరుడైన బాల్క సుమన్ పాలనలో అణిచివేతకు గురవుతున్నారనే విషయాన్ని గమనించి ఆరోగ్యకరమైన సమాజం తయారు చేయాలనే లక్ష్యంతో రాజకీయల్లోకి వచ్చానని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సోమయ్య, పొన్నం లలిత, కాంగ్రెస్ యువ నాయకులు హరీష్ పొన్నం, శ్రావణ్, రవి, సుధీర్, సురేందర్, కృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాల్యమిత్రుని కుటుంబానికి భరోసా

నవతెలంగాణ-తాండూర్

ఇటీవల అనారోగ్యంతో మరణించిన నాయిని నారాయణ కుటుంబ సభ్యులకు మృతుని బాల్య మిత్రులు సోమవారం రూ.70 వేల ఆర్థిక సహాయం చేశారు. అనారోగ్యంతో మృతి చెందిన నారాయణకు భార్య ఉష, ఇద్దరు పిల్లలు శ్రీనివాస్, షైనీలు ఉన్నారు. నారాయణతో విద్యాభారతి తెలుగు మీడియం పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థిని, విద్యార్థులు తమ మిత్రుని కొడుకు, కూతురు చదువుల నిమిత్తము ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దుర్గం మహేందర్, అన్నం రమేష్, ఆవుల రాజేష్, జనార్ధన్, మెరుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంగా విక్రమ్‌కుమార్

నవతెలంగాణ-భీమారం

మండల కేంద్ర జిల్లా పరిషత్ పాఠశల హెచ్‌ఎంగా విక్రమ్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, అందరూ తమకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గద్దె రాంరెడ్డి, ఎస్.శ్రీనివాస్, బన్న రవిందర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మురుగుకాలువ నిర్మాణానికి భూమి పూజ



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణంలోని 25వ వార్డ్‌లో 5 లక్షల సీఎస్ఆర్ నిధులతోమంజూరైన మురుగు కాలువ నిర్మాణ పనులకు సోమవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ శ్వేత, వైస్ చైర్మన్ సుదర్శన్, కౌన్సిలర్ సుజాత, రాములు నాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కిరణ్, నాయకులు శ్రీధర్, గంగాధర్, రాజం పాల్గొన్నారు.

హౌసింగ్ లోన్ వడ్డీ రేటును సవరించాలి

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి కార్మికులకు చెల్లించే హౌసింగ్ లోన్ వడ్డీని సవరించి చెల్లించాలని సోమవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 లక్షలకు వడ్డీ లేని రుణాన్ని కార్మికులకు చెల్లిస్తున్నాం అని డంకా భజాయించి చెప్పుతున్న తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్మికులకు తీవ్రమైన నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకోవడమేనా అని ప్రశ్నించారు. కార్మికులు చెల్లిస్తున్న వడ్డీ సుమారుగా రూ.10 లక్షలకు రూ.85000 వేలుగా ఉందని, కార్మికులకు మాత్రం సుమారుగా రూ.30 వేల నుంచి 50 వేల వరకు మాత్రమే యాజమాన్యం చెల్లిస్తుందని అన్నారు. బ్యాంకు వడ్డీ రేట్లు ఫ్లోటింగ్ పద్ధతిలో దినదినం గణనీయంగా పెరుగుతున్నాయని, అందువల్ల రూ.10 లక్షలకు ఆర్‌బీఐ వడ్డీ రేట్లనే కార్మికులకు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, ఎస్ఆర్పీ ఓసీపీ గౌరవాధ్యక్షుడు బద్రి బుచ్చయ్య, ఓసీపీ అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి సత్తయ్య పాల్గొన్నారు.

సంఘవిద్రోహశక్తులకు సహకరించొద్దు



నవతెలంగాణ -వేమనపల్లి

అనుమానాస్పదమైన వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, సంఘ విద్రోహశక్తులకు సహకరించొద్దని సీఐ విద్యాసాగర్ అన్నారు. ఎస్ఐ సుబ్బారావుతో కలిసి సోమవారం జాజులపేటలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. వాహన పత్రాలు సరిగా లేని 42 బైక్‌లు, 2ఆటోలు, 1 జీప్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువకులు సంఘ విద్రోహ శక్తులకు సహకరించవద్దని అన్నారు. మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు రక్షణ, భద్రత కల్పించడమే పోలీసుల ధ్యేయమన్నారు. ఎవరైన ఆపదలో ఉంటే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. మావోయిస్టుల ప్రలోభాలకు లొంగకుండా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం, ఓటీపీ వివరాలను ఎవరికీ చెప్పవద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు.

కబడ్డీ పోటీలను ప్రారంభం



నవతెలంగాణ-వేమనపల్లి

మండల కేంద్రంలో వేమన యూత్ గణేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోళి వేణుమాధవ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోస్థానిక సర్పంచ్ కుబిడే మధుకర్, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల లింగాగౌడ్, సహకార సంఘం చైర్మన్ కుబిడే వెంకటేశం, గొర్లపల్లి సర్పంచ్ మోర్ల పద్మ మొండి, సుంపుటం సర్పంచ్ కొండగొర్ల బాపు, ముల్కలపేట మాజీ సర్పంచ్ బోరుకుటి సంతోష్, పురాణం లక్ష్మీకాంత్, మాజీ కోఆప్షన్ సభ్యులు హమీద్‌ఖాన్, చామనపల్లి ఉప సర్పంచ్ మహేష్‌రెడ్డి, ఉప అధ్యక్షులు కుమ్మరి బాపు పాల్గొన్నారు.

వైభవంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

నవతెలంగాణ-భీమారం

మండలంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన గణేష్ మండపాలలో నిర్వహించే ప్రత్యేక పూజ, భజన, సంస్కృతిక కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆవుడం క్రాస్ రోడ్డు సమీపంలో ఐబీ యూత్ గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని రావి చెట్టు వాడలోని సాయిరాం యూత్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయిరాం యూత్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 48వ వార్షిక మహోత్సవ వేడుకలో బాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు భక్తి శ్రద్దలతో పెద్ద ఎత్తున కుంకుమ పూజలో పాల్గొన్నారు.

కలమడుగు జడ్పీ పాఠశాలకు కొత్త హెచ్‌ఎం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కలమడుగు జడ్పీ పాఠశాల కొత్త హెచ్‌ఎంగా సోమవారం కట్ట రాజమౌళి బాధ్యతలు చేపట్టారు. కట్ట రాజమౌళి ఇప్పటివరకు అదే పాఠశాలలో ఎన్‌సీసీ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల జరిగిన పదోన్నతులలో భాగంగా ఆయన అదే పాఠశాలకు పీజీహెచ్‌ఎంగా నియమితులయ్యారు. సోమవారం ఆయన పాఠశాలలో హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టారు. దీంతో జన్నారం ఎంఈఓ విజయ్ కుమార్, పాఠశాల సిబ్బంది, గ్రామ ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినదనలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | సెప్టెంబర్ 26, 2023 | www.navatelangana.com

బాధితున్ని పరామర్శించిన మున్సిపల్ చైర్మెన్

నవతెలంగాణ-నిర్మల్

పట్టణంలోని బీఆర్ఎస్ కౌన్సిలర్ అన్వర్ పాషా అనారోగ్యంతో స్థానిక ఆదిత్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ సోమవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితిని గూర్చి సంబంధిత డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే కోలుకోవాలని ఆకాంక్షించారు. చైర్మెన్ వెంట కౌన్సిలర్స్ అబ్దుల్ మతిన్, ముజాయిద్ చౌస్ ఉన్నారు.



బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని మాకోడ గ్రామంలో మాజీ సర్పంచ్ స్వామిరెడ్డి మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జోగు రామన్న సోమవారం వారి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అలాగే అకోలి, కొరాట గ్రామానికి చెందిన పల్లి రమేష్, పడాల నరహరి మృతి పట్ల సానుభూతి వ్యక్తం చేసి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ మహేష్, వెంకన్నతో పాటు మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, చంద్రయ్య ఉన్నారు.



నేడు గణేష్ నిమజ్జనోత్సవం

- బైంసాలో పోలీసుల భారీ బందోబస్తు
- అడుగడుగునా తనిఖీలు

నవతెలంగాణ-భైంసా

సమస్యాత్మక ప్రాంతమైన బైంసా పట్టణంలో మంగళవారం గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా పోలీసులు బారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గణేష్ నిమజ్జనోత్సవాలు ముగియనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో పికెటింగ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు ప్రార్ధన స్థలాల వద్ద, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేపడుతున్నారు. ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆధ్వర్యంలో అడుగడుగునా బందోబస్తును ముమ్మరం చేశారు. బందోబస్తులో అడిషనల్ ఎస్పీతో పాటు నలుగురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 45 మంది ఎస్సైలు, 575 మంది పోలీస్ సిబ్బంది పాల్గొననున్నారు.

డీసీసీ శ్రీహరిరావును కలిసిన పలువురు కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-కడెం

డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావును పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని శ్రీహరిరావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీసీసీ అధ్యక్షులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని సూచించారు. పార్టీని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. డీసీసీని కలిసిన వారిలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రమేష్ వర్మ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తరి శంకర్, సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నిర్మల్ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అర్షద్, మైనార్టీ నాయకులు సలీం ఉన్నారు.

గవర్నర్ చర్య సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టు

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చర్య సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టు వంటిదని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో ఖండించారు. గవర్నర్ కోటాలో దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలపై రాష్ట్ర కాబినెట్ చేసిన సిఫారసును గవర్నర్ తిరస్కరించడాన్ని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తప్పుబట్టారు. ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వం క్యాబినెట్‌లో చర్చించి, ఆమోదించి పంపిన సిఫారసును గవర్నర్ ఆమోదించకపోవటం రాజ్యాంగ వ్యతిరేకమని ఆక్షేపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతుందని విమర్శించారు. ప్రజా, ప్రభుత్వాల అభీష్టానికి అనుగుణంగా గవర్నర్లు వ్యవహరించాలని సూచించారు. గతంలో ఏ గవర్నర్ ఇలా వ్యవహరించిన దాఖలాలు లేవని స్పష్టం చేశారు. ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారి పట్ల ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. రాజకీయ నేపథ్యం ఉన్న వారిని సేవా కోటాలో ఎమ్మెల్సీలుగా ఎలా నియమిస్తారని గవర్నర్ ప్రశ్నిస్తున్నారని, అంటే గవర్నర్‌కు రాజకీయ నేపథ్యం ఉండొచ్చు కానీ గవర్నర్ కోటాలో నామినేట్ చేసే వ్యక్తికి మాత్రం రాజకీయ నేపథ్యం ఉండొద్దా అని మంత్రి ప్రశ్నించారు.

ఎంపీ సోయం బాపురావును సన్మానించిన మహిళలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావును బీజేపీ మహిళా నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన మహిళా బిల్లు ఆమోదం పొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎంపీని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు సుహాసిని రెడ్డి, నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ధోని జ్యోతి, జిల్లా సెక్రటరీ అనిత జైస్వాల్ ఉన్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ ఏ సందర్భంలోనైనా విడుదల కావచ్చు

- సమావేశంలో కర్నాటక ఎమ్మెల్సీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల నోటిఫికేషన్ ఏ సందర్భంలోనైనా విడుదల కావచ్చునని కర్ణాటక ఎమ్మెల్సీ కేశవప్రసాద్ అన్నారు. సోమవారం బీజేపీ పార్లమెంటరీ ప్రవాస్ యోజనలో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఏర్పాటు చేశారు. ముందుగా బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి ఆయనను శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీజేపీ నాయకులు, పదాధికారులు, జిల్లాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించి రాబోయే ఎన్నికలకు సంబంధించి వారితో చర్చించారు. ఈ సందర్భంగా కర్నాటక ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ ఏ సందర్భంలోనైనా విడుదల కావచ్చుని దీని కోసం నాయకులు పార్టీని, బూత్ స్థాయి నుంచి పటిష్ట పరిచేందుకు కృషి చేయాలని అన్నారు. ఏ పార్టీ అయిన ఎన్నికల్లో గెలవడానికి ముఖ్య కారణం పార్టీ క్యాడర్ మాత్రమేనని అన్నారు. రాబోయే ఎన్నికలు రాష్ట్ర భారతీయ జనతా పార్టీకి కీలకమని అన్నారు. అభి నహీ తో కభి నహీ అనే విజన్‌తో ప్రతి ఒక్కరూ పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఇన్‌చార్జీ అయ్యన్నగారి భూమయ్య పార్లమెంట్ కోకన్వీనర్ మయూర్ చంద్ర, జిల్లా ఇన్‌చార్జీ అల్జాపూర్ శ్రీనివాస్, బద్దం లింగారెడ్డి, రమాదేవి, బోయర్ విజయ్, దయాకర్, సంతోష్, లోక ప్రవీణ్‌రెడ్డి, ధోని జ్యోతి, సామ సంతోష్, లాలా మున్న, ఘటిక క్రాంతి, జోగు రవి, ఆకుల ప్రవీణ్, సోమ రవి, కృష్ణ యాదవ్, మహేందర్ నాయకులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు నిర్ణీత వేతనం ఇవ్వాలి



నిర్మల్ జిల్లా కేంద్రంలో నిరవధిక సమ్మెలో పాల్గొన్న ఆశా వర్కర్లు

నవతెలంగాణ-నిర్మల్

ఆశ వర్కర్లకు నిర్ణిత వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు పి.గంగామణి అన్నారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆశా వర్కర్లు నిరవధిక సమ్మెను ప్రారంభించారు. ఈ సమ్మెకు సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఆశా వర్కర్‌లకు నిర్ణిత వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని అన్నారు. గతంలో 106 రోజుల సమ్మె చేశారని, కలెక్టరేట్, డీఎంహెచ్‌ఓ ఆఫీసు ముందు అనేక సార్లు ధర్నాలు చేశారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహించారని గుర్తు చేశారు. కోఠి హైదరాబాద్ హెల్త్ కమిషనర్ ఆఫీస్ ముందు వేలాది మంది ఆశా వర్కర్లతో ధర్నా నిర్వహించడం సైతం జరిగిందన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి చలనం లేదన్నారు. అనేక సంవత్సరాలు గడిచినా రాష్ట్రంలో నేటికీ నిర్ణిత వేతనం నిర్ణయించక పోవడంతో ఆశా వర్కర్లు తీవ్రమైనా ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటం తప్పదని అన్నారు. సంబంధిత రాష్ట్ర, జిల్లా అధికారులకు సమ్మె నోటీసు అందజేశామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆశ వర్కర్లు గిరిజన ప్రాంతాల్లో గత 32 సంవత్సరాలు నుంచి మైదాన ప్రాంతంలో 18 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో సుమారు 28వేల మంది ఆశా వర్కర్లు పనిచేస్తున్నారని అన్నారు. వీరంతా మహిళలు బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారేనని అన్నారు. ప్రారంభం నుండి ఇప్పటివరకు ప్రభుత్వం నిర్ణయించిన అనేక శిక్షణలు పొందారన్నారు. రిజిస్టర్స్ రాయడం, సర్వేలు చేయడం, ఆన్‌లైన్ పనిచేయడం బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర అన్ని రకాల జబ్బులను గుర్తిస్తున్నారన్నారు. ప్రభుత్వం సప్లై చేస్తున్న మందులను ప్రజలకు అందజేస్తున్నారని అన్నారు. తగిన జాగ్రత్తలు ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తున్నారని తెలిపారు. వీటితోపాటు గర్భిణి, బాలింతలు, చిన్న పిల్లలకు ఇతర ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. కరోనా మహమ్మారి కాలంలో కరోనా నియంత్రించడంలో ఆశ వర్కర్ల కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. డబుల్‌హెచ్‌ఓ ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని ఆశ వర్కర్లకు అవార్డును కూడా ప్రకటించిందని అన్నారు. అన్ని పనులు నిర్వహిస్తు, పేద ప్రజలకు సేవలందిస్తున్న ఆశా వర్కర్లకు నేటికీ నిర్ణిత వేతనం ఇవ్వకపోవడం అన్యాయమని అన్నారు. ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, జిల్లా కోశాధికారి రామలక్ష్మి, జిల్లా నాయకులు సుజాత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కుభీర్ : ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు గిరిజ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మెను చేపట్టారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ మండలాధ్యక్షురాలు గిరిజ మాట్లాడారు. ఆయా గ్రామాల్లో పని చేస్తున్న ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.18 వేలు అందించాలన్నారు. అదే విధంగా ఆశాలకు పని భారం తగ్గించి పెండిగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని అన్నారు. పారితోషికం లేని అదనపు పనులు ఆశలతో చేయించవద్దని అన్నారు. దీంతో పాటు అనివార్య కారణాల వల్ల ఆశ వర్కర్స్ మరణించినట్లైతే వారి కుటుంబాన్ని ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ, సులోచన, మంగళ, గంగామణి, లక్ష్మీ, కల్పన, ఆశ వర్కర్స్‌లు ఉన్నారు.

లక్ష్మణచాంద : మండలకేంద్రంలో తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న ఆశా కార్యకర్తలకు బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సోమవారం సమ్మె శిబిరం సందర్శించి సంఘీబావం తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కారించి, ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఇచ్చోడ : చాలిచాలని వేతనంతో ఎంతో కాలంగా పని చేస్తున్న ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా జాయింట్ సెక్రటరీ పవార్ జితేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్ ఆశా కార్యకర్తల సమ్మెను ప్రారంభించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆశా కార్యకర్తలు అనేక పని ఒత్తిడి తట్టుకొని నిత్యం సేవలు అందిచటం వల్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవార్డు పొందారు. కాని అంత కష్టపడి పని చేస్తున్న వారిని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. న్యాయమైన సమస్య పరిష్కారం కోసం అంగన్‌వాడీలు సమ్మె చేస్తే కనీస వేతనం నిర్ణయం చేయాలని ఆందోళన చేస్తుంటే నిర్లక్ష్యం వహిస్తూ అందరిని రోడ్ల మీద పడి వేశారని పేర్కొన్నారు. ఆశా కార్యకర్తల కనీస వేతనం రూ.18వేలు వచ్చే వరకు పోరాటం ఆపేది లేదని తెలియజేశారు. ప్రభుత్వం వెంటనే చర్చించి నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. కరోనా కాలంలో ఆశా కార్యకర్తలు దేవతలని పొగిడిన పాలకులు వారికి కనీస వేతనం నిర్ణయం చేయడం లేదని అన్నారు. సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని ఎన్ని సార్లు కోరినా, కనీస స్పందన రాకపోవడంతో సమ్మె చేస్తున్నామని తెలిపారు. ప్రజల ప్రాణాలు కాపాడిన మహిళ సైనికులు ఆశా కార్యకర్తలు, కంటి వెలుగు, లెప్రసీ, మలేరియా, టీబీ గుర్తింపు కార్యక్రమంలో అత్యున్నత పాత్ర వహించారని అన్నారు. కానీ వారికి బిల్లులు మంజూరు చేయలేని స్థితిలో తెలంగాణ ప్రభుత్వం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ మండల అధ్యక్షురాలు లక్ష్మి, కోకన్వీనర్ అశోక్, రాజేశ్వర్, ఆశ కార్యకర్తలు సుశీల, లలిత, వనిత, సునీత, అమలబాయి, భీమ్‌బాయి, సురేఖ, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



ఇచ్చోడలో ఆశాలకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ముథోల్ : తమ సమస్యలు పరిష్కరించాలని సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆశా కార్యకర్తలు నిరవధిక సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కనీస వేతనం రూ.18 వేలు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతో పాటు హెల్త్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 32 రకాల రిజిస్టర్స్‌ను ప్రింట్ చేయించి ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సమ్మె శిబిరాన్ని ముథోల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌రావు పటేల్ సందర్శించి, సంఘీభావం తెలిపారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఈ సమ్మె కొనసాగుతుందని ఆశ వర్కర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల సంఘం అధ్యక్షులు విజయలక్ష్మి, రాధ, సుజాత, సరితా, ఇంద్ర, రమ, విజయ, ముథోల్, బాసర మండలాల ఆశావర్కర్లు పాల్గొన్నారు.



లక్ష్మణచాందలో ఆశాలకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

నవతెలంగాణ-కుభీర్

ఆలయాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం ముథోల్ క్యాంపు కార్యాలయంలో కుభీర్ మండలంలోని పార్డి(కె) గ్రామంలో నిర్మించే కల్యాణ మండప నిర్మాణానికి రూ.30లక్షల నిధులు మంజూరు కావడంతో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పార్డి(కె) గ్రామస్తులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రతి నియోజకవర్గంలో దేవాలయాలు కల్యాణ మండపాల నిర్మాణానికి సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా గ్రామంలో అన్ని విధాలుగా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి పనులను చేపట్టడం జరిగిందని అన్నారు. మిగిలిన గ్రామాలకు మరిన్ని నిధులు మంజూరు చేసి గ్రామాలను మరింతగా అభివృద్ధి పర్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో కల్యాణ మండపాలు నిర్మించి ప్రారంభించడం జరిగిందని అన్నారు. కొన్ని గ్రామాల్లో పనులు చివరి దశలో ఉన్నాయని తెలిపారు. ఈ పనులను కూడా త్వరలోనే ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ శంకర్ చవాన్ పార్డి(కె) గ్రామస్తులు ఆకుల వెంకటి, సాయన్న, నర్సారెడ్డి ఉన్నారు.



నిధుల మంజూరు ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రమాదబీమా పాలసీలు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండలంలోని రాంపూర్ గ్రామంలో తపాలాశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఓ ఆన్‌లైన్ సెంటర్లో 80 నూతన ఇన్సూరెన్స్ పాలసీలు, 50 నూతన పోస్టల్ అకౌంట్‌లు గ్రామ ప్రజలకు అందించారు. తపాలా శాఖ సూచనల మేరకు తపాలా సర్వీసులను వినియోగించుకునేందుకు ముందుకు వచ్చిన వారికి పోస్టల్ పేమెంట్ బ్యాంక్ మేనేజర్ కళ్యాణ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మరణించినట్లయితే ఈ బీమా పాలసీ ద్వారా పది లక్షల వరకూ చెల్లిస్తారని, ప్రమాదంలో శాశ్వత పూర్తి వైకల్యం ఏర్పడితే పది లక్షల వరకూ చెల్లిస్తారని, అలాగే ప్రమాదవశాత్తు అంగ విచ్ఛేదనం, పక్షవాతం ఏర్పడితే కండ్లు చేతులు విరిగితే పది లక్షలు చెల్లిస్తారని పేర్కొన్నారు. పోస్టల్ శాఖలో మరెన్నో ఇలాంటి పథకాలు ఉన్నాయని ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బిజినెస్ కరస్పాండెంట్ నడిపోల్ల ప్రవీణ్, పవన్, వసంత, రాజేశ్వర్, పోస్ట్‌మ్యాన్ కలీం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు



నియంత పాలన కొనసాగిస్తున్న బీజేపీ ప్రభుత్వం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డబుల్ ఇంజన్ సర్కారు అంటూ గొప్పలు చెప్పుకునే బీజేపీ నాయకులు ఉత్తరప్రదేశ్‌లో నిరుపేదల ఇండ్లను కూల్చేసి నియంత పాలన కొనసాగిస్తున్నారని డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్‌లో దాదాపు ఏడెనిమిది వేల మంది నిరుపేదలు ఉండే ఇండ్లను పోలీసుల సమక్షంలో కూల్చేశారని అన్నారు. నియంత పాలనతో బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజల నడ్డీ విరుస్తోందని అన్నారు. ప్రజా సంక్షేమానికి కేంద్రం చేసిందేమీ లేదన్నారు. సీఎం కేసీఆర్ హయంలోని రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అన్ని విధాలా భరోసా కల్పిస్తోందని స్పష్టం చేశారు. తాజాగా ఎమ్మెల్యే జోగు రామన్న చొరవతో బంగారుగూడలో ఇంటి నెంబర్లను పంపిణీ చేశామని తెలిపారు. రామరాజ్యానికి అసలైన నిదర్శనంగా ప్రభుత్వ పాలన కొనసాగుతోందని అన్నారు. ఇదే సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్నారని, రానున్న ఎన్నికల్లో వారికి ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోకండ్ల రమేష్, బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విజ్జగిరి నారాయణ, సాజిదోద్దీన్, కుమ్ర రాజు, కోఆప్షన్ ఏజాజ్, అబూజర్, అశోక్, ఆశన్న పాల్గొన్నారు.

నిర్మల్‌లో కాషాయ జెండా ఎగురవేద్దాం

- బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

నిర్మల్‌లో కాషాయ జెండాను ఎగురవేసి, అవినీతి పాలనను అంతమొందిద్దామని బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలో ఇంటింటికి బీజేపీ గడపగడపకు మహేశ్వర్‌రెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని మునిపెల్లి, మల్లాపూర్, మాచాపూర్ గ్రామాల్లో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నిర్మల్‌లో బీజేపీ జెండా ఎగరరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాయ మాటలు నిర్మల్ ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. నియోజకవర్గమంతా పక్కన పెట్టి తన సొంతూరు ఎల్లపల్లిలో ఆర్భాటంగా ఆరంభించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తొమ్మిదిన్నర ఏండ్లుగా తన కుటుంబ సభ్యుల, అనుచరుల ఆస్తులు పెంచుకునేందుకు ప్రయత్నించారే తప్పా ఏ రోజు నిర్మల్ అభివృద్ధి గురించి పట్టించుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండల అధ్యక్షులు గోవర్ధన్, మునిపెల్లి గ్రామ సర్పంచ్ పద్మా వెంకట్‌రెడ్డి, మల్లాపూర్ సర్పంచ్ అడిచేర్ల రవి, అయిండ్ల భూపాల్‌రెడ్డి, కౌన్సిలర్ రాజేందర్, ముత్యంరెడ్డి, హరీశ్‌రెడ్డి, సరికెల గంగన్న, చిన్నయ్య, భూపతిరెడ్డి, నారాయణ్‌రెడ్డి, అర్జున్, మాజీ ఎంపీటీసీ శంకర్, మాచాపుర్ ఉపసర్పంచ్ అశోక్, రాయదారి ముత్యం, నర్సారెడ్డి, నరేష్, అశోక్, నల్లా రాజశేఖర్‌రెడ్డి, డ్రైవర్ ముత్తన్న, రాంపెల్లి మహేష్, సంతోష్, రాకేష్, బక్కయ్య పాల్గొన్నారు.

ప్రజలకు పోలీసులు అండగా ఉండాలి

నవతెలంగాణ-నిర్మల్

ప్రజలకు పోలీసులు అండగా ఉండాలని, వారితో స్నేహభావంగా ఉండాలని ఎస్పీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల విభాగం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి సమస్యలను తెలుసుకొని అర్జీలను స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సంబంధిత సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. నాణ్యమైన పోలీసు వ్యవస్థను జిల్లా ప్రజలకు అందించి, పోలీసుల గౌరవం మరింత పెంచే విధంగా కృషి చేయాలని తెలిపారు. శాంతి భద్రతలను విఘాతం కల్గించే వారిపట్ల కఠినంగా చట్టరీత్యా చర్యలుంటాయన్నారు. పోలీసుల సహాయం కావాలనుకున్నా వారు పోలీసు స్టేషన్‌లో నిర్భయంగా ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనుమానస్పదన వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని దృష్టికి వస్తే వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేయాలన్నారు. లేదా జిల్లా వాట్సప్ నెంబర్ 8712659599కు సమాచారం తెలియజేయాలని కోరారు.

గ్రామాల్లో కొనసాగుతున్న వైద్యశిబిరాలు

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్‌తో పాటు వివిధ గ్రామాల్లో వైద్య సిబ్బంది సోమవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిహత్నూర్ ఎస్సీ వాడలో నిర్వహించిన వైద్య శిబిరంలో 45 మంది రోగులకు వైద్యం అందించామని సూపర్‌వైజర్ చరణ్‌దాస్ పేర్కొన్నారు. బీపీ, షుగర్, జ్వరం, దగ్గు లాంటి దీర్ఘకాలిక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన ఉచిత మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రత సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది రాథోడ్ సుశీల, చౌహన్ సింధు, ఆశా అనిత ఉన్నారు.